సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 26 । అక్టోబర్ । 2023

రాజన్నకు మొక్కులు



వేములవాడ: వేములవాడ రాజన్నకు సెలవుల రద్దీ కొనసాగుతుంది. బుధవారం రాజన్నను 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దసరా సెలవుల ముగింపు రోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శనానికి భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీతో ఆలయ అధికారులు అభిషేకాలు, అన్న పూజల టికెట్లు, గర్భగుడి దర్శనాలను కట్టడి చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు తిరుపతిరావు, శ్రీరాములు పరిశీలించారు.



ఓటు ఒక ఆయుధం. దాని విలువ ఉపయోగించే వ్యక్తిని బట్టి ఉంటుంది.
– టి.రూజ్‌వెల్ట్

మీకు తెలుసా?

● ఏకగ్రీవ ఎమ్మెల్యే లక్ష్మీనర్సింహారావు

జగిత్యాల నియోజకవర్గం 1957లో ఏర్పడగా.. ఇప్పటివరకు కాసుగంటి లక్ష్మీనర్సింహారావు ఒక్కరే ఏకగ్రీవంగా ఎమ్మెల్యేగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన ఆయన జగిత్యాలలోనే స్థిరపడి న్యాయవాదిగా కొనసాగారు. ఆయనను ప్రజలు వకీల్‌సాబ్. అని ఆప్యాయంగా పిలిచేవారు. ఆయనకు ప్రజల్లో ఉన్న పేరు, ప్రఖ్యాతులను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ 1962 అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల టికెట్ ఇవ్వగా విజయం సాధించారు. రెండోసారి 1967లోనూ కాంగ్రెస్ తరుపున బరిలో నిలవగా.. ఆయనపై ఎవరూ పోటీ చేయకపోవడంతో ఏకగ్రీవమయ్యారు. 1972లోనూ పోటీ చేయాలని కాంగ్రెస్ కోరినా.. కొత్తవారికి అవకాశం ఇవ్వాలని టికెట్‌ను తిరస్కరించడం విశేషం. ఆయన శిష్యుల్లో నారాయణరెడ్డి మెట్‌పల్లి, రత్నాకర్‌రావు జగిత్యాల, బుగ్గారం, జగపతిరావు కరీంనగర్, జగిత్యాల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారు. లక్ష్మీనర్సింహారావు జగిత్యాల నుంచి అసెంబ్లీకి ఆర్టీసీ బస్సులోనే వెళ్లేవారు. గ్రామాల్లో విద్యుత్, రోడ్ల సమస్యల పరిష్కారానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయన జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.కోటిన్నరతో జగిత్యాల కోర్టులో న్యాయవాదుల కోసం గ్రంథాలయాన్ని నిర్మించారు.

– జగిత్యాలజోన్



లక్ష్మీనర్సింహారావు




జగిత్యాల కోర్టులో నిర్మించిన గ్రంథాలయం

ఓటు అనేది అత్యంత శక్తివంతమైన అహింసాయుత ఆయుధం.
– జాన్ లివిస్



వలస నేతల వస్త్ర నేల!

- సిరిసిల్లగా మారిన నేరెళ్ల
- మెట్ట ప్రాంతం.. కార్మిక క్షేత్రం
- నాడు కాంగ్రెస్.. నేడు టీఆర్‌ఎస్



ఒకప్పటి నేరెళ్ల.. నేటి సిరిసిల్ల నియోజకవర్గం వలసనేతలకు నిలయంగా మారింది. 1952 నుంచి ఇప్పటి వరకు ప్రతీసారి ఇతర ప్రాంతాలకు చెందిన నేతలే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 1962లో ఏర్పడిన నేరెళ్ల నియోజవర్గం 2009లో సిరిసిల్లగా మారింది. నేరెళ్ల నియోజకవర్గం నుంచి గెలుపొందిన వారికి మంత్రి యోగం దక్కింది. రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన తంగళ్లపల్లికి చెందిన గొట్టె భూపతి మినహా.. కర్రెల్లి నర్సయ్య, సుద్దాల దేవయ్య, కాసిపేట లింగయ్య, ప్రస్తుత ఎమ్మెల్యే కె.తారకరామారావు స్థానికేతరులే.

నేటి సిరిసిల్ల నాటి నేరెళ్ల ఎమ్మెల్యేలు

పదవీ కాలం	ఎమ్మెల్యే	పార్టీ
1957–1962	కర్రెల్లి నర్సయ్య	పీడీఎఫ్
1962–1967	బి.జానకీరాం	కాంగ్రెస్
1967–1972	గొట్టె భూపతి	ఇండిపెండెంట్
1972–1978	గొట్టె భూపతి	ఇండిపెండెంట్
1978–1983	పాటి రాజం	కాంగ్రెస్(ఐ)
1983–1885	పాటి రాజం	కాంగ్రెస్
1985–1989	ఉప్పరి సాంబయ్య	జనతా
1989–1994	పాటి రాజం	కాంగ్రెస్
1994–1999	సుద్దాల దేవయ్య	టీడీపీ
1999–2004	సుద్దాల దేవయ్య	టీడీపీ
2004–2009	కాసిపేట లింగయ్య	టీఆర్‌ఎస్
2009–2010	కె.తారకరామారావు	టీఆర్‌ఎస్
2010–2014(ఉపఎన్నిక)	కె.తారకరామారావు	టీఆర్‌ఎస్
2014–2015	కె.తారకరామారావు	టీఆర్‌ఎస్
2018–2023	కె.తారక రామారావు	టీఆర్‌ఎస్



కె.తారకరామారావు



కాసిపేట లింగయ్య



కర్రెల్లి నర్సయ్య



గొట్టె భూపతి



పాటి రాజం



సుద్దాల దేవయ్య

సిరిసిల్ల ✍

సిరిసిల్ల.. మెట్టప్రాంతం..కార్మికక్షేత్రం. ఐదు దశాబ్దాలపాటు నేరెళ్ల నియోజకవర్గంగా ఉన్న ప్రాంతం 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా సిరిసిల్లగా ఏర్పడింది. వస్త్రోత్పత్తి ఖిల్లా సిరిసిల్ల పట్టణంతో కలిసి ఒకప్పటి నేరెళ్ల(ఎస్సీ) నియోజకవర్గ పరిధిలోని ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లోని గ్రామాలను ఈ నియోజకవర్గంలో కొత్తగా కలిపారు. పాత నేరెళ్ల నియోజకవర్గం పరిధిలోని ఇల్లంతకుంట మండలాన్ని మానకొండూరు(ఎస్సీ)లో కలిపారు. ఒకప్పటి నేరెళ్ల రాజకీయ చరిత్రనే సిరిసిల్లకు వర్తిస్తుంది. నాటి సిరిసిల్ల నియోజకవర్గంలోని మండలాలను కలిపి కొత్తగా వేములవాడ నియోజకవర్గంగా ఏర్పాటైంది.

అరవై ఆరేళ్లుగా..

1952లో ద్విసభ్య నియోజకవర్గంగా సిరిసిల్ల ఉంది. దీని పరిధిలో వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాలు ఉండేవి. తొలిసారిగా 1952లో జరిగిన ఎన్నికల్లో పీడీఎఫ్ ఒక స్థానాన్ని, షెడ్యూల్ కులాల



టెక్స్‌టైల్ పార్క్

సమాఖ్య మరోస్థానాన్ని పొందాయి. 1957లో జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాలు పీడీఎఫ్ గెలుచుకుంది. 1962లో తొలిసారిగా నేరెళ్ల నియోకవర్గం ఏర్పాటైంది. తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామం పేరిట ఈ నియోజకవర్గం ఏర్పడగా.. గంభీరావుపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల పట్టణంతోపాటు శివారు గ్రామాలతో కలిపి విస్తరించి ఉంది. నేరెళ్ల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పాటి రాజం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, చిన్ననీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. టీడీపీ హయాంలో సుద్దాల దేవయ్య సహకారశాఖ, కార్మికశాఖ మంత్రిగా కొనసాగారు. ప్రస్తుత సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖల మంత్రిగా ఉన్నారు. పాటి రాజం మంత్రిగా ఉండగానే 1994లో హఠాన్మరణం పొందారు. పాటి రాజం ఇక్కడ మూడు సార్లు, సుద్దాల దేవయ్య రెండు సార్లు, కేటీఆర్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరుగగా.. పీడీఎఫ్ ఒక్కసారి, కాంగ్రెస్, కాంగ్రెస్(ఐ) పార్టీ నాలుగుసార్లు, తెలుగుదేశం రెండు సార్లు, జనతాపార్టీ ఒక్కసారి, స్వతంత్ర అభ్యర్థులు రెండు సార్లు, టీఆర్‌ఎస్ ఐదు సార్లు గెలిచింది.

ఈ ప్రాంత ప్రత్యేకతలు

- పశ్చిమాన కామారెడ్డి, దక్షిణాన సిద్దిపేట జిల్లాతో ఈ నియోజకవర్గం కలిసి ఉంది.
- మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒక్కటైన ఎగువ మానేరు జలాశయం గంభీరావుపేట మండలం నర్మాలలో ఉంది. దీన్ని నిజాం చివరి నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1945–51 మధ్య నిర్మించారు. 32 అడుగుల నీటి సామర్థ్యం గల ఈ జలాశయం గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని 17 వేల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా.. ప్రస్తుతం 10వేల ఎకరాలకు కుదించారు.
- ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో అటవీప్రాంతం విస్తరించి ఉంది.
- సిరిసిల్ల పట్టణంలో 34 వేల మరమగ్గాలతో రెండో షోలాపూర్‌గా ఖ్యాతిగాంచింది. 75 అద్దకం, 30 సైజింగ్, 65 వార్పిన్ పరిశ్రమలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మంది కార్మికులు వస్త్రపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు.
- రాష్ట్రంలోనే తొలి టెక్స్‌టైల్ పార్కును సారంపల్లి–బద్దెనపల్లి మధ్య నెలకొల్పారు. పార్క్‌లో 115 పరిశ్రమలు వస్త్రోత్పత్తిని సాధిస్తుండగా.. 3వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.
- నియోజకవర్గానికి ఎగువమానేరు ప్రధాన నీటి వనరు కాగా.. ఇప్పుడు మధ్యమానేరు ప్రధాన సాగునీటి వనరుగా మారింది.
- సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) సిరిసిల్ల ప్రాంతంలో విద్యుత్ పంపిణీ చేస్తుంది. దేశంలోనే అగ్రగామి సంస్థగా ఖ్యాతిగాంచింది.
- గల్ఫ్ వలసలు ఇప్పటికీ ఆగలేదు.
- నియోజకవర్గం పొడవునా మానేరుతీరం ఉండడం మరో విశేషం.

ప్రస్తుత పరిస్థితి

- ఒకప్పుడు నేరెళ్ల నియోకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. తొలినాళ్లలో పీడీఎఫ్ అభ్యర్థులు విజయం సాధించగా.. తరువాత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. పాటి రాజం మరణాంతరం జరిగిన 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సుద్దాల దేవయ్య కాంగ్రెస్ అభ్యర్థి గొట్టె భూపతిపై అనూహ్య విజయం సాధించారు. 1999లోనూ దేవయ్య గెలుపొందారు. 2004లో టీఆర్‌ఎస్ అభ్యర్థి కాసిపేట లింగయ్య, సుద్దాల దేవయ్యపై విజయం సాధించారు. 2009 మహాకూటమి అభ్యర్థిగా టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తనయుడు కె.తారకరామారావు సిరిసిల్ల బరిలో నిలిచి 171 స్వల్ప ఓట్ల తేడాతో స్వతంత్ర అభ్యర్థి కె.కె.మహేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. ప్రస్తుతం కె.కె.మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. 2010లో రాష్ట్ర సాధన ఉద్యమంలో కేటీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా.. తర్వాత జరిగిన ఉపఎన్నికల్లోనూ కేటీఆర్, మహేందర్‌రెడ్డిపై గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కొండూరి రవీందర్‌రావుపై కేటీఆర్ విజయం సాధించారు. ప్రస్తుతం కొండూరి రవీందర్‌రావు టీఆర్‌ఎస్‌లో చేరి, టెస్కాబ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. తర్వాత వివిధ పరిణామాలతో టీఆర్‌ఎస్ పార్టీ బీఆర్‌ఎస్‌గా మారింది. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మళ్లీ మంత్రి కేటీఆర్ బరిలో దిగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా కె.కె. మహేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా రాణి రుద్రమారెడ్డి పోటీలో ఉంటుండగా.. ఇంకా బీఎస్పీతోపాటు ఇతర పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించలేదు. సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు రాష్ట్ర కీలకమంత్రిగా ఉండడంతో జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గంలో గత తొమ్మిదేళ్లలో అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. మెడికల్ కాలేజీ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్, వ్యవసాయ డిగ్రీ కాలేజీతోపాటు గార్మెంట్ పరిశ్రమ విస్తరించాయి. జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగాయి.

కాపుల సమరం!

అసెంబ్లీ బరిలో బీసీలు!

- రంగంలో మున్నూరుకాపులు
- కరీంనగర్, వేములవాడ, రామగుండంలో దూకుడు
- పద్మశాలీ, ముదిరాజ్, గౌడ, కురుమ అభ్యర్థులూ పోటీ
- స్థానికత, సామాజిక సమీకరణాలపై నేతల ఆశలు



సాక్షిప్రతినిధి,కరీంనగర్ ✍

ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పలువురు బీసీ నేతలు ఉన్నారు. వీరిలో అధిక శాతం బలమైన సామాజిక నేపథ్యం, ఉన్నత విద్యావంతులు, రాజ కీయ అనుభవం కలిగినవారే కావడం విశేషం. మున్నూరుకాపు సామాజిక వర్గం నుంచి ఎక్కు వ మంది అభ్యర్థులు ఉండటం గమనార్హం. వీరే కాక, పద్మశాలీ, గౌడ, ముదిరాజ్, యాదవ తది తర బలమైన సామాజికవర్గాల నుంచి రాజ కీయ ఆశావహులు బరిలో నిలుస్తున్నారు. నోటిఫికేషన్‌కు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో మరింత మంది బీసీలు అసెంబ్లీ బరిలోకి దిగుతారని సమాచారం. స్థానికత, బీసీ నినాదం, పార్టీ చరిష్మా తదితర అంశాలు తమ విజయానికి దోహదపడతాయని భావిస్తున్నారు. ఉమ్మ డి జిల్లాలో ప్రస్తుతం బలమైన బీసీ సామాజికవర్గానికి చెందిన నేతలు పోటీ పడుతున్న నియోజవకర్గాలను ఒకసారి పరిశీలిద్దాం.

వేములవాడ: ఇక్కడి నుంచి గత నాలుగు పర్యాయాలుగా పోటీ చేస్తున్న ఆది శ్రీనివాస్(కాంగ్రెస్) ఈసారి కూడా బరిలో ఉన్నారు. మున్నూరు కాపు కావడం, దాదాపు 30 వేల పైచిలుకు ఓట్లు తన సామాజికవర్గానికి చెందినవే ఉండటంతో విజయంపై ధీమాగా ఉన్నారు. అదే సామాజికవర్గానికి చెందిన డాక్టర్ గోలి మోహన్ బీఎస్పీ నుంచి పోటీలో ఉన్నారు. కురుమ సామాజికవర్గానికి చెందిన తుల ఉమ బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. యాదవులు, కురుమల ఓట్లు 25 వేల వరకు ఉన్నాయని, విజయం సాధిస్తానని భావిస్తున్నారు.

కోరుట్ల: బీజేపీ నుంచి బీసీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ బరిలో ఉన్నారు. తన అమ్మమ్మ బంధుగణం, స్నేహితులు, సన్నిహితులు ఇక్కడే ఉండటం, బలమైన మున్నూరు కాపు సామాజికవర్గం, వారివి 26 వేల ఓట్లు ఉండటం మిగిలిన బీసీ కులాలు కూడా మద్దతిస్తారని అర్వింద్ వర్గం ధీమాగా ఉంది. వీటికి తోడు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానన్న హామీ తన విజయానికి దోహదపడుతుందని అంటున్నారు.

జగిత్యాల: బీజేపీ నుంచి పద్మశాలీ సామాజికవర్గానికి చెందిన భోగ శ్రావణి బరిలో ఉన్నారు. సొంత సామాజికవర్గానికి చెందిన 20 వేల ఓట్లు, ప్రధాని మోదీ చరిష్మా, బీసీ నినాదం, ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసి వస్తాయని ఆమె వర్గం అంటోంది.

కరీంనగర్: బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి గంగుల కమలాకర్ బరిలో ఉన్నారు. రాష్ట్రంలోనే బలమైన బీసీ నేతగా గుర్తింపు పొందారు. మున్నూరుకాపు సామాజికవర్గం కావడం, నియోజకవర్గంలో దాదాపు 40 వేల పైచిలుకు వారివే ఓట్లు ఉండటం, కేబుల్ బ్రిడ్జి, స్మార్ట్‌సిటీ, మానేరు రివర్‌ఫ్రంట్, సంక్షేమ పథకాలు నాలుగోసారి శాసనసభకు పంపుతాయని గంగుల అభిమానులు లెక్కలు వేసుకుంటున్నారు.

- మరోవైపు బీజేపీ నుంచి బరిలో నిలవనున్న ఎంపీ బండి సంజయ్ కూడా ఇదే సామాజిక వర్గం కావడం గమనార్హం. రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీని బలోపేతం చేసిన తీరు, హిందుత్వ నినాదం, కేంద్రం నిధులు, ప్రధాని మోదీ చరిష్మా తదితరాలు కలిసివస్తాయని ధీమాగా ఉన్నారు.

హుజూరాబాద్: ఏడుసార్లు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన ఈటల రాజేందర్ మరోసారి బరిలో నిలవనున్నారు. బలమైన ముదిరాజ్ సామాజిక వర్గం కావడం, నియోజకవర్గంలో వారివే 26 వేల ఓట్లు ఉండటం, మంత్రిగా గతంలో ఇక్కడ చేసిన అభివృద్ధి పనులతో తనకు మరోసారి ప్రజా ఆశీర్వాదం లభిస్తుందని విశ్వసిస్తున్నారు.

రామగుండం: ఇక్కడ విచిత్ర పరిస్థితి నెలకొంది. పోటీ చేసే నాయకులంతా బీసీలే. కోరుకంటి చందర్(బీఆర్‌ఎస్), సోమారపు సత్యనారాయణ ఇద్దరూ బలమైన మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందినవారు. ఈ ఓట్లు నియోజకవర్గంలో దాదాపు 24 వేలు ఉన్నాయి. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న మక్కాన్‌సింగ్ ఠాకూర్ కూడా బీసీనే. బీసీ నినాదంతోపాటు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పర్యటన, సింగరేణి ప్రైవేటీకరణ, ప్రభుత్వ వ్యతిరేకత తనను గెలిపిస్తాయని ఫేర్కొంటున్నారు.

మంథని: అధికార పార్టీ నుంచి పుట్ట మధు మరోసారి బరిలో నిలవనున్నారు. బలమైన మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన నేత కావడం, వీరి ఓట్లు దాదాపు 29 వేలు ఉన్నాయి. స్థానికుడు, బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గెలిపిస్తాయని ఆయన వర్గం భావిస్తోంది.

పెద్దపల్లి: బీఎస్పీ నుంచి పెద్దపల్లి అభ్యర్థిగా బరిలో దిగుతున్న దాసరి ఉషది పద్మశాలీ సామాజికవర్గం. బహుజన నినాదంతో ముందుకు సాగుతున్న ఈ ఐఐటీయన్ సొంత సామాజికవర్గం ఓట్లు దాదాపు 35 వేలు వరకు ఉన్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకత, మార్పునకు శ్రీకారం, విద్యావంతుల మద్దతు తదితర అంశాలు గెలిపిస్తాయని ఆమె వర్గం ధీమాగా ఉంది.

హుస్నాబాద్: ఇక్కడ కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, బీజేపీ నుంచి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిలు పోటీ పడుతున్నారు. గౌడ సామాజికవర్గానికి చెందిన ఓట్లు 35 వేల పైచిలుకు, మున్నూరుకాపు ఓట్లు దాదాపు 30 వేల వరకు ఉన్నాయి. సొంత సామాజికవర్గాలు, ఇతర బీసీ కులాల మద్దతు, జాతీయ పార్టీల ఇమేజ్ తమకు కలిసి వస్తాయని వారు విశ్వసిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి చక్రధర్‌రెడ్డి !



చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ సింగిల్‌విండో మాజీ చైర్మన్, రెడ్డి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కనమేని చక్రధర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఏడాది క్రితమే బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన చక్రధర్‌రెడ్డి అక్కడ ఇమడలేక కాంగ్రెస్ గూటికి చేరుతున్నారని సమాచారం. తెలంగాణ రాష్ట్ర అవతరణ సమయంలో కాంగ్రెస్‌ను వీడిన చక్రధర్‌రెడ్డి మంత్రి కేటీఆర్ పిలుపుతో టీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి కేటీఆర్‌కు ప్రధాన అనుచరుడిగా పనిచేసిన చక్రధర్‌రెడ్డి.. గత సింగిల్‌విండో ఎన్నికల్లో ఓటమి చెందారు. టీఆర్‌ఎస్‌లోని సొంత పార్టీ నాయకులే మోసం చేశారని అప్పట్లో ఆయన కేటీఆర్‌కు ఫిర్యాదు చేశారు. నాటి నుంచి బీఆర్‌ఎస్‌తో అంటీముట్టనట్టుగానే ఉంటున్నారు. అనంతరం అనూహ్యంగా బీజేపీలో చేరారు. ఇటీవల రాజకీయ పరిణామాల దృష్ట్యా సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి పిలుపుతో ఆ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. పదేళ్ల తర్వాత తిరిగి సొంత గూటికి చేరుతుండగా.. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిసింది.

నామినేషన్లు సవ్యంగా స్వీకరించాలి



- జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి



సమావేశానికి హాజరైన అధికారులు

సిరిసిల్ల: రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు సవ్యంగా స్వీకరించాలని జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం నామినేషన్ దాఖలు ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్లపై రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. మాస్టర్ ట్రెయినర్లు నామినేషన్ ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్లపై అధికారులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ నామినేషన్ స్వీకరించే రోజు నుంచి ప్రక్రియ ముగిసే రోజు వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ దాఖలుకు సమయమని తెలిపారు. నామినేషన్ ప్రక్రియను చిత్రీకరించాలని సూచించారు. నామినేషన్ల స్క్రుటినీ రిటర్నింగ్ అధికారి మాత్రమే చేయాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు, సర్వీస్ ఓటర్లు, స్పెషల్ ఓటర్లతోపాటు తాజాగా 13 రకాల అత్యవసర సేవల సిబ్బందికి సైతం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల కారణంగా ఓటు వేయలేకపోయే అత్యవసర సేవల ఉద్యోగులకు తాజాగా స్థానం కల్పించిందన్నారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, దూరదర్శన్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, ఆలిండియా రేడియో, భారతీయ రైల్వే, ఆర్టీసీ, విద్యుత్, ఆరోగ్యం–కుటుంబ సంక్షేమం, ఆహారం, పౌర సరఫరాలు, అగ్నిమాపక శాఖలు, కేంద్ర ఎన్నికల సంఘం ధ్రువీకరించే జర్నలిస్టులను ఈ విభాగంలో చేర్చినట్లు వివరించారు. ఆయా సంస్థలు రిటర్నింగ్ అధికారుల ద్వారా ఉద్యోగులకు ఫారం–12డీ ఇప్పించి, పోస్టల్ బ్యాలట్ ఓటు సదుపాయాన్ని కల్పించొచ్చని ఈసీ స్పష్టం చేసిందని వివరించారు. అదనపు కలెక్టర్‌లు ఎన్.ఖీమ్యా నాయక్, బి.గౌతమ్‌రెడ్డి, ఆర్డీవో ఎన్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, సీపీవో శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఎల్లారెడ్డిపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- ఎల్లారెడ్డిపేటలో కార్యకర్తల సమావేశం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అన్నివర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు 1.33 లక్షల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారుల అవినీతి, అక్రమాలతోనే నియామకాలు నిలిపివేయడం జరిగిందన్నారు. వ్యవసాయానికి ఉచిత కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గుర్తుచేశారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం ఐదు మెడికల్ కాలేజీలు ఉండగా, రాష్ట్రం ఏర్పాటయ్యాక 35 కాలేజీలు ఏర్పడ్డాయన్నారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్ కుమార్, రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, కృష్ణారెడ్డి, బండారి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న రెపా ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట: పదోతరగతిలో పది జీపీఏ సాధించిన మండలంలోని రెడ్డి విద్యార్థులను బుధవారం రెపా(రెడ్డి ఎంప్లాయీస్ ప్రొఫెషనల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో సన్మానించారు. ఎల్లారెడ్డిపేటలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నేవూరి హారికరెడ్డి, తోకల దీక్షిత్‌రెడ్డి, గుర్రాల స్ఫూర్తిరెడ్డి, పొన్నాల తన్విక రెడ్డిలను సన్మానించారు. వీరితోపాటు సామాజిక కార్యకర్త వంగ గిరిధర్‌రెడ్డి, జాతీయ అవార్డు గ్రహీత ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, తెలుగు విశిష్ట కళారత్న అవార్డు అందుకున్న ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న నాయని భాస్కర్ రెడ్డిని సన్మానించారు. రేపా మండలాధ్యక్షుడు మోతె దేవారెడ్డి, ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి ముత్యాల వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కోల బాపురెడ్డి, సలహాదారులు నిమ్మ నారాయణరెడ్డి, అలిగిరెడ్డి అమరేందర్‌రెడ్డి, యమగొండ బాల్‌రెడ్డి, పాతూరి రమేశ్‌రెడ్డి, కొండే రామిరెడ్డి, నారాయణరెడ్డి, తోకల శివారెడ్డి, రాగుల లింగారెడ్డి, నేవూరి దేవేందర్‌రెడ్డి, పొన్నాల మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దసరా విశిష్టతను విస్మరించొద్దు



సిరిసిల్ల: దసరా పండగ విశిష్టతను విస్మరించొద్దని సిరిసిల్ల గీతా ప్రచార సేవా సమితి ప్రతినిధి జనపాల శంకరయ్య పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్ హనుమాన్ ఆలయంలో బుధవారం సి రిసిల్ల గీతా ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో కోడం నారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. కుడుముల నారాయణ దసరా విశిష్టత గురించి వివరించారు. స్థానిక కౌన్సిలర్ దార్నం అరుణ, సీని యర్ సిటిజన్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు చేపూరు బుచ్చయ్య, గడ్డం కౌసల్య, బూర సారంగం, శారదా, గౌరిశెట్టి ఆనందం, కైలాసం ఉన్నారు.

మద్యం మత్తులోనే రైతు ఆత్మహత్య

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నకొమిర గ్రామానికి చెందిన పచ్చిక రవీందర్‌రెడ్డి(35) మంగళవారం ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. అయితే, అతను మద్యం మత్తులోనే క్రిమిసంహారక మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. మృతుడి భార్య బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్ మాజీ సర్పంచ్ రామ భీమేశ్వర్ తల్లి అనారోగ్యంతో మృతి చెందగా.. వారి కుటుంబాన్ని బుధవారం టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఏఎంసీ డైరెక్టర్ సత్యం, నాయకులు దేవారెడ్డి, మిట్టపల్లి లక్ష్మీనారాయణ, ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఆహ్లాదం.. ఆదాయం

- భవిష్యత్ ప్రయోజనాలకు 'సంపద వనాలు'
- ఇరిగేషన్ స్థలాల్లో మొక్కల పెంపకం
- గంభీరావుపేట, బోయినపల్లి మండలాల్లో 15 బ్లాక్‌లు


సంపద వనంలో పెరుగుతున్న మొక్కలు



గంభీరావుపేట మండలం నర్మాలలో ఏర్పాటు చేసిన సంపద వనం

గంభీరావుపేట(సిరిసిల్ల): భవిష్యత్‌లో ప్రజలకు ఆహ్లాదం పంచడానికి, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చేలా ప్రభుత్వం 'సంపద వనాల' పెంపునకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పచ్చదనం పెంపు లక్ష్యంగా హరితహారం కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మరో అడుగు ముందుకేసి విలువైన కలప, పండ్లు, పూల చెట్లు పెంచి పచ్చని పర్యావరణానికి, పంచాయతీలకు ఆదాయ మార్గాలుగా సంపదవనాలు మారనున్నాయి. జిల్లాలోని గంభీరావుపేట, బోయినపల్లి మండలాల్లో ఇరిగేషన్ స్థలాలను అధికారులు గుర్తించారు. అక్కడ వనాల పెంపు ప్రారంభించారు. గంభీరావుపేట మండలం నర్మాలలో ఐదు, బోయినపల్లిలో 10 బ్లాకులుగా విభజించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వాటి సంరక్షణ బాధ్యతలను గ్రామపంచాయతీలకు అప్పగించారు. సంపద వనాల్లో టేకు, మద్ది, వేప, చింత, అల్లనేరేడు, ఉసిరి, మామిడి వంటి మొక్కలు పెంచుతున్నారు. పెరిగిన కలపను నరికితే గ్రామపంచాయతీలకు భవిష్యత్‌లో ఆదాయం సమకూరే అవకాశం ఉంది. వాటిని గ్రామాభివృద్ధికి ఖర్చు చేసుకునే వీలు కలుగుతుంది. అంతేగాకుండా మొక్కల పెంపకంతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వ భావన. వాతావరణ కాలుష్యం కూడా తగ్గే వీలుంటుంది.

సంపద వనాలతో పచ్చదనం



పచ్చదనం పెంపునకు సంపద వనాలు దోహదపడతాయి. భవిష్యత్‌లో ఆదాయవనరులుగా మారే అవకాశం ఉంది. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాంతంలో ఇరిగేషన్ స్థలాన్ని ఐదు బ్లాకులుగా విభజించి వివిధ రకాల మొక్కలు నాటాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో, గంభీరావుపేట

సంరక్షణ చర్యలు చేపడుతున్నాం



ఇరిగేషన్ స్థలాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో సంపదవనాల్లో నాటిన మొక్కల సంరక్షణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. మొక్కలకు కంచెలు ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు నీటిని పడుతున్నాం. మొక్కలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండిపోకుండా చూసుకుంటున్నాం. భవిష్యత్‌లో ఇవి వనాలుగా మారి ఆహ్లాదాన్ని పంచుతాయని, ఆదాయాన్ని ఇస్తాయని భావిస్తున్నాం.

– ఎడబోయిన రాజు, నర్మాల సర్పంచ్

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

- డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి
- ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, బోయినపల్లి, కోనరావుపేటల్లో కవాతు


ఎల్లారెడ్డిపేటలో పోలీసుల కవాతు

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/కోనరావుపేట: ఎన్నికల వేళ పల్లెల్లో అసాంఘిక శక్తులకు తావు లేదని చెప్పేందుకు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని.. ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని పోలీస్ అధికారులు కోరారు. జిల్లాలోని ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, బోయినపల్లి, కోనరావుపేట మండలాల్లో సాయుధ జవాన్లు కవాతు చేపట్టారు. ఈ కవాతులో డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, సీఐలు సదన్‌కుమార్, కృష్ణకుమార్, శశిధర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఎస్సైలు శేఖర్‌రెడ్డి, మహేందర్, రమాకాంత్, ఆంజనేయులు, హెచ్‌సీలు బాలనర్సయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన పోలీసులు


బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అగ్రహారం శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను పోలీసులు సకాలంలో ఆస్పత్రికి తరలించి కాపాడారు. సంఘటన స్థలంలోనే సీఆర్పీఎఫ్ పోలీసులు ప్రథమ చికిత్స అందించి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆపద సమయంలో మానవత్వం చాటిన పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు. అగ్రహారంలో సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తుండగా రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. ఆ సమయంలో అక్కడే ఉన్న డీఎస్పీ సూచనలతో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ తమ వాహనాలలో క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

పోలీసు అమరుల త్యాగాలు మరవొద్దు

- డీఎస్పీ ఉదయ్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

సిరిసిల్లక్రైం: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాణాలర్పించి పోలీసు అమరుల త్యాగాలను మరవొద్దని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి కోరారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం(ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్ ముందు బుధవారం కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, ఎస్సై ప్రేమానందం, ఆర్ఎస్సై రమేశ్, ఎన్జీవో ఓజా పాల్గొన్నారు.

జిల్లా ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము


కోర్టుకు హాజరైన జిల్లా నాయకులు

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా కోసం ఉద్యమించిన తమపై కేసులు ఎత్తివేయాలని వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా ఉద్యమకారుడు చొక్కాల రాము డిమాండ్ చేశారు. కేసు నిమిత్తం బుధవారం జిల్లా కోర్టుకు ఉద్యమకారులు కంసాల మల్లేశం, వీరవేణి మల్లేశం, మైలారం తిరుపతి, ఎండీ సలీంలతో హాజరై విలేకరులతో మాట్లాడారు. తాము నిస్వార్థంగా పోరాడితేనే జిల్లా ఏర్పడిందని.. కానీ తమపై కేసులు మాత్రం ఉన్నాయన్నారు. తమ త్యాగాలను ఎవరు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉద్యమ జేఏసీ నాయకులు, మంత్రి కేటీఆర్ స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.



దేవదేవునికి నీరాజనం

సిరిసిల్లటౌన్: దేవదేవునికి భక్తులు నీరాజనం పలికారు. ఐదు రోజులుగా కొనసాగుతున్న సిరిసిల్ల శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలతో కార్మికక్షేత్రం పులకించింది. బుధవారం ఉదయం 10 గంటలకు శ్రీవారికి ప్రీతికరమైన గరుడ వాహనం, సాయంత్రం 5 గంటలకు కాళింగ మర్దనం, రాత్రి 9 గంటలకు హనుమంత వాహనాలపై శ్రీదేవి, భూదేవి సహితంగా శ్రీవారిని మాడవీధుల్లో ఊరేగించారు. ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, తీగల శేఖర్‌గౌడ్, చేపూరి నాగరాజు, ఈవో నాగారపు మారుతిరావు, ఏఈవోలు పీసరి రవీందర్, ప్రభాకర్, ప్రధాన అర్చకులు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

- ఇద్దరికి తీవ్ర గాయాలు


లింగంపేట శివారులో బోల్తాపడ్డ కారు

చందుర్తి(వేములవాడ): మండలంలోని లింగంపేట శివారులోని పెద్దమ్మ ఆలయ సమీపంలో బుధవారం ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. కోరుట్లకు చెందిన ఓ కుటుంబం కారులో వేములవాడకు వెళ్తుండగా మార్గమధ్యలో చందుర్తి మండలం లింగంపేట శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. పొలాల వద్ద ఉన్న రైతులు వెళ్లి బోల్తా పడ్డ కారును లేపి అందులో ప్రయాణిస్తున్న వారిని బయటకు తీశారు. కారులో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలుకాగా.. ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

వివాహిత అదృశ్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లిలో ఓ వివాహిత అదృశ్యమైంది. ఈ సంఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. రాచర్ల గొల్లపల్లికి చెందిన పెద్దూరి అరవింద్‌కు వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన నేరెళ్ల లాస్యతో ఏడాది క్రితం వివాహమైంది. లాస్య బుధవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. లాస్య తల్లి మరియమ్మ ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వేములవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ బండ మల్లేశం, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, తీగల రవీందర్‌గౌడ్, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని 9వ వార్డు సుభాష్‌నగర్, బద్దిపోచమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయినపల్లి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఇంటింటి ప్రచారం చేపట్టారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో వెనుకబాటు

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్
- నిజామాబాద్‌లో ఇంటింటా ప్రచారం


నిజామాబాద్‌లో ప్రచారం చేస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): బీఆర్‌ఎస్ పాలనలో మండలం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందని డీసీసీ అధ్యక్షుడు, వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని నిజామాబాద్‌లో బుధవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కోనసీమగా మారుస్తామన్న హామీ ఏళ్లుగా ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. మూలవాగుపై కాంగ్రెస్ హయాంలో నిర్మించిన వంతెనలు కొట్టుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా తాత్కాలిక మరమ్మతులే తప్ప శాశ్వత పనులు ఎందుకు చేపట్టడం లేదన్నారు. సిరిసిల్ల నుంచి నిజామాబాద్ జిల్లా సిరికొండకు వెళ్లే రోడ్డు ఇప్పటికీ సరిగ్గా లేదన్నారు. కోనరావుపేటలో డిగ్రీ కాలేజీ ఏమైందని అడిగారు. ఒక్కసారి అవకాశం ఇస్తే అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, బైరగోని నందు, బొర్ర రవీందర్, సాసాల మల్లారెడ్డి, నాగండ్ల భూమేశ్, తాళ్లపెల్లి ప్రభాకర్, పెంతల శ్రీనివాస్, వెంకన్న, వేణు, ప్రదీప్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు పంచనని కేటీఆర్ ప్రమాణం చేయాలి

- కేకే మహేందర్‌రెడ్డి


రాజన్నపేటలో ప్రచారం చేస్తున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎన్నికల సందర్భంగా సిరిసిల్ల నియోజకవర్గంలో డబ్బులు, మద్యం పంచనని అంబేడ్కర్ సాక్షిగా మంత్రి కేటీఆర్ ప్రమాణం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. మండలంలోని రాజన్నపేటలో బుధవారం ఇంటింటా కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా పాల్గొని మాట్లాడారు. మంత్రి కేటీఆర్ దత్తత తీసుకున్న రాజన్నపేటలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఇప్పటికే మీటింగ్‌లకు డబ్బులు ఇచ్చి తీసుకెళ్తున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ' నాణ్యతా ప్రమాణాలపై విచారణ చేపట్టాలి

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ నాణ్యతా ప్రమాణాలపై సీబీఐతో విచారణ చేయించాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కమీషన్ల కోసమే నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రాజెక్టుల నిర్మించిందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ, ఎల్ఎండీ, కడెం ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కు చెదరలేదన్నారు. మిషన్‌భగీరథ, మిషన్‌కాకతీయ సైతం కమీషన్ల కోసమే ప్రవేశపెట్టారన్నారు. సిరిసిల్ల మానేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు నాణ్యత లోపాలతోనే పగుళ్లు ఏర్పడుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కామునివనిత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజ్, వైద్య శివప్రసాద్, గోలి వెంకటరమణ, అన్నల్‌దాస్ భాను తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో కార్యకర్తలకు సముచిత స్థానం


కాంగ్రెస్‌లో చేరుతున్న మల్లాపూర్ యువకులు

బోయినపల్లి(చొప్పదండి): కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తుందని చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని మల్లాపూర్‌కు వాసి దుబాయిలో ఉంటున్న వారాల నర్సింగం ఆధ్వర్యంలో పలువురు యువకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. సత్యం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏనుగుల కనకయ్య, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, పిట్టల మోహన్, బోయిని ఎల్లేశ్, నల్ల మోహన్, నిమ్మ వినోద్‌రెడ్డి, మల్కాపురం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన ఇద్దరి బైండోవర్

చందుర్తి(వేములవాడ): మండలంలోని మల్యాలకు చెందిన ఇద్దరిని బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. మల్యాల గ్రామానికి చెందిన పోంచెట్టి అంజయ్య, పార్టీ సుధాకర్ మంగళవారం వాటాప్స్ గ్రూపులో రెచ్చగొట్టే పోస్టులను పెట్టుకుంటూ.. దూషణకు దిగడంతో బుధవారం అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. సోషల్ మీడియాలో ఇతరులను రెచ్చగొట్టేలా.. దూషించి పోస్టులు పెట్టిన, షేర్‌చేసిన, లైక్‌లు కొట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రూపు అడ్మిన్‌లపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ సిబ్బంది

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని అడవిపదిరకు చెందిన భూక్య చిన్నారెడ్డి, గర్జనపల్లికి చెందిన బానోత్ విఠల్ మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. రూ.10వేల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. గుడుంబా తయారీ ముడిసరుకు బెల్లం, పటిక, బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సిబ్బంది కిశోర్‌కుమార్, మల్లేశం, సర్దార్, కృష్ణకాంత్, దివ్య, రాజేందర్ ఉన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

- సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్


మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

సిరిసిల్ల: రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని సిరిసిల్ల ఆర్డీవో, ఓటరు నమోదు అధికారి ఎస్.ఆనంద్‌కుమార్ కోరారు. ఆర్డీవో ఆఫీస్‌లో బుధవారం అన్ని పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఎన్నికల ప్రచా రానికి అనుమతి తీసుకోవాలని సూచించారు. 15 అంశాలకు సంబంధించిన అనుమతులు సువిధ పోర్టల్ ద్వారా దరఖా స్తు చేసుకుని అనుమతి పొందవచ్చని వివరించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదయ్యేందుకు ఈనెలాఖరు వరకు అవకాశం ఉందన్నారు. గజభీంకార్ రాజన్న, నాగుల శ్రీనివాస్, కల్యాణచక్రవర్తి, తీగల శేఖర్‌గౌడ్, మహమ్మద్ అహ్మద్‌ఖాన్, కరుణాకర్, ఎం.కమలాకర్ పాల్గొన్నారు.